సంపుటి: 2| సంచిక: 3

మార్చి - ఏప్రిల్, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక




గుడ్ ఫ్రైడే మరియు ఈస్టర్ శుభాకాంక్షలలో...



# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

దేవుని నామములో స్పర్శ పాఠకులైన ప్రతి ఒక్కరికి నా హృదయపూర్వక వందనములు.

మీరు మీకు దేవుడు అనుగ్రహించిన కుటుంబములతో ఎల్లప్పుడు శాంతి సమాధానము కలిగి జీవించాలని నా హృదయాభిలాష మరియు దేవునికి ప్రార్థనయై యున్నది. దేవుని విశ్వసించిన మనము కేవలం మన గురించి మాత్రమే కాక మన పొరుగువారు, లోకమంతా నెమ్మదిగా, క్షేమముగా ఉండవలెనని కోరుకొనవలసి ఉన్నది. నిజమైన దైవత్వములో సంకుచిత భావములకు చోటు లేదు. విశాల దృక్పథముతో జీవించవలయును.

మనము ప్రజాస్వామ్యదేశంలో పుట్టి, జీవించుట ఒక గొప్ప భాగ్యము. ముఖ్యముగా మరియొక 5 సంవత్సరములు దేశమును, రాష్ట్రములను పరిపాలన చేసేవారిని ఎన్నుకునే సమయం ఆసన్నమైనది. ఎవరు మనకు మంచి పరిపాలన ఇవ్వగలరో వారికి ఓటు వెయ్యవలెనని నా మనవి. దయచేసి కులం, మతం అనే వాటిని బట్టి నాయకులను ఎన్నుకొనవద్దు. ఎట్టి పరిస్థితులలోను ఓటు కొరకు డబ్బును తీసుకొనవద్దు అని నా విన్నపము. వారు ఇచ్చి వెళ్ళిపోయారు లేక ఏమైనా అనుకుంటారని తీసుకున్నాను అనే కుంటిసాకులు చెప్పవద్దు. మనకు దేవుడు అనుగ్రహించిన దేశములో ఓటు ఎంతో శక్తివంతమైనది కనుక ఓటు వేయడం మానవద్దు అని హెచ్చరించుచున్నాను. దేశములోను, మన రాష్ట్రములలోను మంచి ప్రభుత్వాలు ఏర్పడాలని పట్టుదలతో ప్రార్థన చేద్దాం.

అలాగే ఈ సంవత్సరమునకు ఫైనల్ ఎగ్జామ్స్ దగ్గర పడుచున్నవి కనుక మన విద్యార్థులు ఎగ్జామ్స్ బాగా వ్రాయాలని ప్రార్థన చేయుదము. వారి భవిష్యత్ ఆశీర్వాదకరముగా ఉండాలని నా ఆకాంక్ష!

అట్టి ధన్యత దేవుని వలన కలుగును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 2 | సంచిక: 3 మార్చి - ఏప్రిల్, 2014

# దేవుని స్పర్శ

## ఈ సంచికలో...


- బోధలు... 2
- కెంటకీలో ఉజ్జీవం 5
- ఎంతో నమ్మకమైన 6
- విడువక... (స్త్రీల ప్రత్యేకం) 7
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 33వ భాగము 10
- విజయరహస్యం (బాలల శీర్షిక) 12
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) 14
- సిలువ రక్తము 16
- ప్రార్థన ఊపిరి పీల్చుట వంటిదే 19
- లోయలు 21
- బైబిల్ క్విజ్ - 33 22
- జన్మదిన శుభాకాంక్షలు 23


మా చిరునామా :
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1 శాంతి నగర్ వాటర్ట్యాంకు ఎదురుగా
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040 -2420 2227

# బోధలు...

**- బ్రదర్. ఎపఫ్రా**

నేడు క్రైస్తవ్యము కేంద్రముగా అనేక బోధలు వినబడుచున్నవి. సంఘములలో, పత్రికలలో మరియు టి.విల ద్వారా ఎన్నడూ లేనంత విరివిగా బోధలు ప్రకటించబడుచున్నవి. ఈ బోధలలో అనేక వైరుధ్యములు స్పష్టముగా మనము గమనించవచ్చు. ఎవరి బోధలను ప్రామాణికంగా తీసుకోవాలో తెలియని పరిస్థితులలో సామాన్యమైన ప్రజలు ఉన్నారు. ఈ కన్‌ఫ్యూజన్ వలన కొందరు దేవునికి దూరమైపోతున్నారు. మనము దేవుని సన్నిధికి దూరం కావడం పరిష్కారం కాదు కానీ, దేవుని వాక్యమును చదివి, ధ్యానించి, పరిశుద్ధాత్మ దేవుని ద్వారా సరియైన ఆలోచనలను పొంది, ఆ మార్గములో నడుచుకొనుటయే చేయవలసిన విధి.

**1. నూతనముగా దేవుని యొద్దకు వచ్చువారు :-**

నూతనముగా వచ్చేవారు తమకు తమ కుటుంబములకు అనారోగ్యములో స్వస్థత, ఆర్థిక సమస్యల నుండి విడుదల మరియు మనశ్శాంతి కావాలి అనే వాటి కొరకు కావచ్చు. వీటన్నిటిని దేవుడు అనుగ్రహిస్తాడు అనుటలో ఎటువంటి సందేహము లేదు. అయితే మానవుని ప్రతి బాధకు కారణమైన పాపము పరిహరింపబడవలసి యున్నది. మనుష్యులందరి పాపపరిహారార్థమై యేసుక్రీస్తు పాపశిక్షను భరించడం జరిగింది. ఈ సంగతిని ప్రతి ఒక్కరు గ్రహించుటయే నిజమైన రక్షణ. ఉదాహరణకు ఒక గ్రామం మధ్యలో మురుగు గొయ్యి ఒకటి ఉంది, దాని నుండి వెలువడే దుర్వాసన వలన ఎంతో మంది ఇబ్బంది పడుతుండేవారు. ఆ మురుగు వలన దినదినము దోమలు విస్తరిస్తూ ఉండేవి. వాటి బారిన పడి ఎంతో మంది అనారోగ్యము పాలవుతుండేవారు. వీటన్నిటికి పరిష్కారంగా గ్రామ పెద్దలు దుర్వాసన రాకుండా, దోమలు విస్తరించకుండా మెడిసిన్ స్ప్రే చేశారు. కొన్ని రోజులు బాగానే ఉన్నా, మరల అవే సమస్యలు. వాటి నుండి శాశ్వతమైన పరిష్కారం ఆ మురుగు గుంట అక్కడ లేకుండా చేయడం. అదే విధముగా సమస్త బాధలకు కారణమైన పాపమును మానవ హృదయములో నుండి తీసివేయుటకు యేసుక్రీస్తును విశ్వసించుటయే నిజమైన పరిష్కారం. దానికి బలమైన ఆధారము బైబిల్ గ్రంథములో చెప్పబడింది.

**వారు ఈ మాట విని హృదయములో నొచ్చుకొని - సహోదరులారా, మేమేమి చేతుమని పేతురును కడమ అపొస్తలులను అడుగగా । పేతురు - మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరము పొందుదురు. ఈ వాగ్దానము మీకును మీ పిల్లలకును దూరస్థులందరికిని, అనగా ప్రభువైన మన దేవుడు తన యొద్దకు పిలిచిన వారికందరికిని చెందునని వారితో చెప్పెను. ఇంకను అనేక విధములైన మాటలతో సాక్ష్యమిచ్చి**

**- మీరు మూర్ఖులగు ఈ తరము వారికి వేర్పై రక్షణ పొందుడని వారిని హెచ్చరించెను । కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి, ఆ దినమందు ఇంచుమించు మూడువేల మంది చేర్చబడిరి. - (అ.పో. కా॥2:37-41)**



నూతనముగా దేవుని యొద్దకు వచ్చిన వారికి అవసరమైన విషయము పాడైపోయిన హృదయమును యేసుక్రీస్తు బాగు చేస్తాడని విశ్వసించడం. నేటి దినములలో అనేకమంది బోధకులు వారి బోధలలో ఈ విషయమును ప్రస్తావించకపోవడం దారుణమైన విషయము. జనరంజకంగా ఉండుటకు తప్ప శాశ్వత ప్రయోజనముల కొరకు మాట్లాడుట లేదు. ఎంత గొప్ప బోధకులైనా వారి బోధలకు ప్రామాణికం బైబిల్ గ్రంథమే కానీ మరే ఇతర సంగతులు కాదు. ప్రజల ఆమోదం ఉందని దైవవాక్యమునకు వ్యతిరేకమైన బోధలు చేయటం సమర్థనీయం కాదు.

**2 నూతన విశ్వాసులు :-**

విశ్వసించి బాప్తిస్మము ద్వారా క్రొత్త జన్మ అనుభవములోనికి వచ్చిన ప్రతి ఒక్కరు దేవుడు వారికి ఇచ్చిన సంఘములో శ్రద్ధగా వాక్యమును వినుచు, విశ్వాసములో ఎదగవలెను. ఇదే విషయాన్ని పౌలు తిమోతికి వ్రాసిన పత్రికలో ఈలాగు చెప్పియున్నాడు. **ఈ సంగతులను సహోదరులకు వివరించిన యెడల నీవు అనుసరించుచూ వచ్చిన విశ్వాస సుబోధ సంబంధమైన వాక్యములచేత పెంపారుచూ క్రీస్తు యేసునకు మంచి పరిచారకుడవై యుందువు. అపవిత్రములైన ముసలమ్మ ముచ్చట్లను విసర్జించి, దేవ భక్తి విషయములో నీకు నీవే సాధకము చేసికొనుము. శరీర సంబంధమైన సాధకము కొంచెము మట్టుకే ప్రయోజనకరమవును కాని దైవ భక్తి ఇప్పటి జీవము విషయములోను రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవును (1తిమోతి 4:6-8).** విశ్వసించిన వారిని దేవుని వాక్యము ద్వారా పెంచాలనే శ్రద్ధ అనేక మంది క్రైస్తవ నాయకులలో కనిపించుట లేదు. కేవలం వారి సంఘ అభివృద్ధి కొరకు ఎలా ఉపయోగించుకోవాలా అనే దురాశ మాత్రమే కనబడుచున్నది. దేవుని రాజ్య వ్యాప్తి కంటే సొంత సామ్రాజ్యములను స్థాపించుటలో తీరిక లేకుండా పరిగెత్తుచున్నారు. రక్షించబడిన వారు పెద్దలకు లోబడి, తమ్ముని తాము తగ్గించుకొని, షరతులు లేని ప్రేమ చూపుటలో, క్షమించుటలో ఎదగవలయును. తాను వెళ్ళుచున్న దేవుని సంఘములో ఒక అవయవము వలె మిగిలిన వారందరితో పని చేయవలెను. తన రాబడి అంతటిలో దేవుని భాగమైన దశమ భాగమును నమ్మకముగా దేవుని మందిరములో ఇవ్వవలయును. నేడు ఇలాగున క్రమమైన పద్ధతిలో ఎదుగుచున్నవారు ఎంత మంది? అనేక సంఘములలో ఆత్మీయ క్రమశిక్షణ కనిపించుట లేదు. వారు ఏ వారం ఏ మందిరమునకు

వెళ్ళుదురో, వెళ్ళకపోవుదురో తెలియదు. ఇది ఎంతో భ్రష్టత్వము. కొందరు దశమ భాగములతో బీదలకు, అనాధలకు సహాయం చేస్తూ, మరికొందరు టి.వి ప్రోగ్రామ్స్ స్పాన్సర్ చేస్తూ, తమ మనస్సాక్షిని మోసగించుకొనుచున్నారు. ఇట్టివి వాక్యమునకు విరుద్ధము. నూతనముగా విశ్వసించినవారు సరియైన సంఘములో, వాక్యానుసారమైన బోధలలో ఎదుగుచుండవలెను.

**3. విశ్వాసములో కొనసాగుచున్నవారు :-**

దేవుని విశ్వసించి కొన్ని సంవత్సరములుగా ముందుకు వెళ్ళుచున్నవారు తమ బాధ్యతలు ప్రక్కన పెట్టి, విశ్లేషణలు చేస్తూ వాళ్ళ వాక్యము ఇలా ఉంది, వీళ్ళ వాక్యము అలా ఉంది అని అనుకుంటూ పూర్తిగా నేర్చుకొనుటకు దూరమైపోతున్నట్లు ఉన్నారు. ఇదే విషయాన్ని పౌలు **2 తిమోతి 2:14లో ఈలాగు చెప్పాడు. వినువారిని చెరుపుటకే గాని మరి దేనికిని పనికిరాని మాటలను గూర్చి వాదము పెట్టుకొనవద్దని, ప్రభువు ఎదుట వారికి సాక్ష్యమిచ్చుచు ఈ సంగతులను వారికి జ్ఞాపకము చేయుము.** కొన్ని విషయములు మనకు తెలిసినంత మాత్రమున మనము గొప్పవారమని, మనలను అందరూ గౌరవించాలని, సంఘములో ఏదో విధంగా గుర్తింపు కావాలని ప్రాకులాడటం మంచిది కాదు. పాటలు పాడాలని, వాక్యమును చెప్పాలని అవకాశముల కొరకు తిరుగుచూ, మన పైన ఉన్న నాయకత్వమును ఎదిరించుట ఎంతో ఆందోళనకరము. పైన ఉన్న అధికారమును ఎదిరించువారు దేవుని ఎదిరించుచున్నారు అను మాటను బట్టి నాశనమే వారి అంతము. ఇట్టివాటికి మనము దూరముగా ఉందుము గాక! మనం ఎంత గొప్ప స్థాయికి వెళ్ళిననూ ప్రతివారికి ఏ విధంగా ఉపయోగపడగలమా అనే ఉపకారబుద్ధి కలిగి జీవించవలయును. అంతే కాని ఎదుటి వారి నుండి ఏదియూ ఆశించకూడదు. అనేకులకు ప్రకటించి నేను భ్రష్టుడనైపోవుదునేమోనని నన్ను నేనును, నా శరీరమును నలగగొట్టుకొనుచున్నానని అపో.పౌలు చెప్పడం జరిగింది. నిజముగా దేవునిలో కొన్ని సంవత్సరములుగా విశ్వాసమును కాపాడుకొనుచు కొనసాగుతున్న వారు వెనక వచ్చుచున్న వారికి అన్ని విషయములలో మాదిరి కనపరచుచుండవలయును.

ప్రియమైన దేవుని స్పర్శ పాఠకులైన మీరు వాక్యమునకు వ్యతిరేకమైన బోధలలో పడి కొట్టుకొనిపోకుండా లేక సాతాను నేర్పించిన స్వనీతి బోధలలో జీవించకుండా ప్రతి ఒక్కరు, ఎవరి స్థాయిలో వారు బైబిల్ గ్రంథములోని దేవుని వాక్యానుసారమైన బోధలో నిలిచి ఉండాలని హృదయపూర్వకంగా కోరుకొనుచున్నాను.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక !

# కెంటకీలో ఉజ్జీవం

1792లో జాన్ వెస్లీ మరణించిన తరువాత, బ్రిటిష్ సంఘ నాయకులు ఐక్య ప్రార్థన కోసం పిలుపునిచ్చారు. అది రెండవ గొప్ప మేల్కొలుపుగా మారింది. ఈ తదుపరి గొప్ప మేల్కొలుపులో పరిశుద్ధాత్మ శక్తి వలన దేవుని రాజ్యంలోనికి వేల కొద్ది ప్రజలు వచ్చారు.

గ్రేట్ బ్రిటన్‌లో ఏమి జరుగుతుందో గమనించిన అమెరికా సంఘ నాయకులు ప్రార్థన కోసం కూడుకోవడం మొదలుపెట్టారు. అమెరికా దేశంలో నైతిక పతనం వలన సంఘం వెనక్కు తిరిగిందని గుర్తించింది. గ్రేట్ బ్రిటన్ వలె ప్రార్థనా సమావేశాల నెట్‌వర్క్‌ను అమెరికా కలిగియుండేంత వరకు సంఘాలన్ని ఒక ప్రణాళికను చేపట్టాయి. అట్లాంటిక్ మీదుగా దేవుడు అమెరికా దేశంలోకి ఉజ్జీవం తేవడానికి ఎక్కువ సమయం పట్టలేదు. అలాంటి ఒక ఉజ్జీవం కెంటకీలో చోటు చేసుకుంది. పరిశుద్ధాత్ముడు ఆ ప్రాంతాన్ని ఆక్రమించకముందే అన్యాయం ప్రతిచోటా ప్రాకింది. కెంటకీలో ఏ న్యాయస్థానం కూడా ఒక్కసారే 5సంవత్సరాలకు మించి లేదని కాంగ్రెస్ కనుగొంది. చట్టం, న్యాయం కోసం పోరాడటానికి జాగరణ విభాగానికి వ్యతిరేకంగా వ్యవస్థను నియమించాల్సి వచ్చింది.

సంఘ నాయకులు ప్రార్థన సమావేశాలను ఏర్పాటు చేశారు. అప్పుడు వాటి మధ్యలో దేవుడు కదలడం మొదలుపెట్టాడు. పరిశుద్ధాత్మ ఒప్పుదల క్రిందికి కొన్ని వేల మంది ప్రజలు వచ్చారు. ఒక ఆరాధనలో 11,000 మంది ప్రజలు హాజరైనారు. రెండవ గొప్ప మేల్కొలుపు నుండి ఒక ఆధునిక మిషనరీ ఉద్యమం సమాజాల్లో వచ్చింది. దాని నుండి బానిసత్వ నిర్మూలన, పేరుగాంచిన విద్య, బైబిలు సమాజాలు వచ్చాయి. సండేస్కూళ్లు, అనేక సామాజిక ప్రయోజనాలు సువార్త తగ్గుముఖానికి దారితీశాయి. రెండవ గొప్ప మేల్కొలుపులో ఉజ్జీవం తరువాత ఉజ్జీవం అమెరికాను ఉద్ధరించింది. దేవుని ప్రజలు తీవ్రంగా ప్రార్థించినప్పుడు ఇదంతా జరిగింది.

ఉజ్జీవం దేవుని మీద ఆధారపడింది. ఉజ్జీవం కోసం ప్రార్థించడానికి దేవుడు తన ప్రజల మీద ఆధారపడతాడు. పరిశుద్ధాత్మ బలమైన సంచారం చూడాలనే ఆకలి, ఆసక్తి మీకుందా? ఒకవేళ మీకు ఆ ఆసక్తి లేకుంటే, దేవుడు నిన్ను పవిత్ర ఆకలితో నింపాలని మీరు దేవునికి ప్రార్థించగలరు. దేవుడు నీ హృదయాన్ని భారంతో నింపుతుండగా తీవ్రంగా ప్రార్థించండి, ప్రార్థించండి. ఉత్సాహంతో ఉజ్జీవం కోసం ప్రార్థించండి. మీ ప్రార్థనలకు స్పందనగా దేవుడు చేసే అద్భుత కార్యాలను చూడటానికి మీకు ఎంత ఆసక్తి ఉంది?

# ఎంతో నమ్మకమైన ....

గౌరవనీయమైన స్థానంలో ఉన్న ఒక స్త్రీ కుక్కని పెంచుకుంటూ ఉండేది. దాని మీద ఆమెకి ఎంతో అభిమానం. ఎందుకంటే ఆ స్త్రీ తన చిన్న బిడ్డను విడిచి, బయటి పనులు చూచుకొని వచ్చినప్పటికి, ఆ కుక్క ఎంతో శ్రద్ధగా కాపలా కాస్తూ ఉండేది. ఇలాగున అనేకసార్లు జరుగుచూ వచ్చింది.

**ఒక దినం ఊహించని దుఃఖకరమైన సంఘటన :–**

యథావిధిగా ఆ స్త్రీ తన చిన్నబిడ్డను నమ్మకమైన కుక్క దగ్గర విడిచి, షాపింగ్‌కి వెళ్ళింది. తిరిగి వచ్చేసరికి అంతా అయోమయం అయ్యే దృశ్యం కనిపించింది. ఆ చిన్న బిడ్డ కనిపించలేదు, మంచం చిందరవందరగా ఉంది. బట్టలు రక్తపు మరకలతో అక్కడక్కడ కొన్ని ముక్కలు పడి ఉన్నాయి. గదిలో ఉన్న ఈ దృశ్యమును చూచి ఆ తల్లి నిర్ఘాంత పోయింది. బాబు కోసం చూస్తుండగా ఆ మంచం క్రింద నుండి రుచికరమైన భోజనమును తిన్నట్లుగా మూతిని నాక్కుంటూ వస్తున్న కుక్క కని పించి ంది. వెంటనే ఈ దృశ్య మును చూచిన ఆ స్త్రీ తన బిడ్డని ఆ కుక్కే తిని ఉంటుందని ఊహించుకొని,ఇంకేమీ ఆలోచించకుండా, దుడ్డు కర్ర ఒకటి తీసుకొని ఆ కుక్కని కొట్టి చంపి వేసింది. ఇంతలో గదిమూలలో నుండి వస్తున్న చిన్న బాబు సురక్షితంగా ఉండడం కొంచెం దూరంలో నక్క శరీరం ముక్కలు ముక్కలు చేయబడి ఉండడం కనిపించింది. అది చూస్తుంటే చిన్న బాబుని రక్షించడానికి కుక్క ఎంతో పోరాడినట్లుగా కనబడుతుంది.



వాస్తవం ఆ స్త్రీని ఎంతో కలిచివేసింది. కుక్క చిన్నబిడ్డను కాపాడడానికి, ప్రాణానికి తెగించినట్లుగా అర్థం అవుతుంది. ఇప్పుడు తన కోపమును, అహమును వెనుకకి తీసుకుందామన్నా సమయం మించిపోయింది. జరగకూడని అనర్థం జరిగిపోయింది. నమ్మకమైన కుక్కని చంపివేసింది.

ఇలా ఎన్నిసార్లు తప్పుగా అర్థం చేసుకొని మన కఠినమైన మాటలతో, అజ్ఞానపు పనులతో ఎదుటి వారి వ్యక్తిత్వమును చంపుతున్నామో కదా! కొంచెం సహనము జీవితకాలమంతా బాధపడే తప్పులు చేయకుండా మనలను కాపాడుతుంది.

# విడువక...

**- సిస్టర్ విజయ**

మానవుని జీవితం సృష్టిలో ప్రత్యేకమైనదని బైబిల్ గ్రంథమును విశ్వసించిన వారందరు ఒప్పుకొనే విషయం. అయితే జీవితంలో వచ్చే విపత్కర పరిస్థితులను ఎలా భరించాలి? వాటిని ఎదుర్కొని ఎలా ముందుకు వెళ్ళాలో తెలియని పరిస్థితి. ఇలాంటి సమయములలో కొందరు ఆత్మహత్యలవైపు మొగ్గుచూపితే, మరికొందరు పూర్తిగా నిరాశ, చింత అనే ఊబిలో దిగిపోయి భయంకరమైన జీవితాన్ని జీవిస్తుంటారు. మొట్టమెదటగా స్త్రీలు తమ జీవితములో ఉన్న ప్రతి పరిస్థితిని అంగీకరించడం నేర్చుకొనవలెను. మనము మన పరిస్థితిని అంగీకరించలేకపోతే అది ఎంతో ఇబ్బందికరమైన విషయం, క్షణం కూడా నెమ్మదిగా ఉండలేము. ఎందువలన అంటే ఇతరులు ఏమనుకుంటారో అనే బాధ తమ్మును తాము అంగీకరించలేని వారిలో ఎక్కువ. అందువలననే ఎవరితో మాట్లాడకపోవడం, వారి పరిస్థితులను బట్టి ఎవరు ఏ ప్రశ్న వేస్తారో అని మనుష్యులను తప్పించుకొని తిరగడం కనిపిస్తుంది.



ఒకనాడు ఒక స్త్రీ తన కుమార్తె బహు బాధపడుచున్నదని, దురాత్మ వలన హింసించబడుచున్నదని యేసు వెళ్ళుచున్న మార్గములో వెంటపడుచు, బిగ్గరగా కేకలు వేయుచున్నది. అయినా ఆయన ఒక్క మాట కూడా చెప్పలేదు, మౌనంగా వెళ్ళుచున్నాడు. ఆమె వ్యక్తిత్వం ఎంత గొప్పది. సిగ్గు విడిచి గట్టి గట్టిగా కేకలు వేయుచున్నప్పటికీ, ఆయన స్పందించకపోవుట చూచి కూడా ఏమాత్రమూ నిరాశచెందలేదు. ఇంకనూ కేకలు వేస్తూనే ఉంది. తన కుమార్తె స్వస్థత పొందవలెనని ఆమె కోరిక. ఆమె కేకలకు శిష్యులు కూడా ఇబ్బంది పడి ఈమెను పంపివేయమని యేసయ్యను వేడుకోవడం జరిగింది. అప్పుడు **ఆయన - ఇశ్రాయేలు ఇంటివారిలో నశించిన గొఱ్ఱెల యొద్దకే గాని మరి ఎవరి యొద్దకును నేను పంపబడలేదనెను. మత్తయి 15:24.** ఈ మాటలకు కారణం యూదులు కానివారి పట్ల ఆయనకు ప్రేమ, కనికరం లేక కాదు, ఆయన తన సువార్త లోకమందంతట తెలియడానికి ముందు నశించుచున్న ఇశ్రాయేలీయుల కొరకు చేయవలసిన పని ఉన్నది. దానికి ఋజువు మనము మత్తయి 10:5,6లో చూడవచ్చు. **యేసు ఆ పండ్రెండుమందిని పంపుచు, వారిని చూచి వారికాజ్ఞాపించినదేమనగా - మీరు అన్యజనుల దారిలోనికి వెళ్లకుడి. సమరయుల యే పట్టణములోనైనను ప్రవేశింపకుడి గాని! ఇశ్రాయేలు వంశములోని నశించిన గొర్రెల యొద్దకే**

**వెళ్లుడి!** అంతగా ఆయన చెప్పినప్పటికీ ఆమె ఆయనకు మ్రొక్కి ప్రభువా నాకు సహాయం చేయమని అడుగుచున్నది. ఎలా అయినా తన కుమార్తె బాగుపడవలెను అనే తపన, గట్టి పట్టుదల ఈమెలో కనబడుచున్నది. ఆమె ఎంతగా సహాయం కొరకు అభ్యర్థించినను, ఆయన ఆమె మాటను అంగీకరించక పిల్లల రొట్టె తీసి కుక్కపిల్లలకు వేయుట సరికాదు అని చెప్పియున్నాడు. వెంటనే ఆమె కుక్కపిల్లలు కూడా తమ యజమానుల బల్ల మీద నుండు పడు రొట్టె ముక్కలు తినును గదా అని తన విశ్వాసమును వెల్లడిపరిచింది. యేసయ్య మౌనం కాని, శిష్యుల నిరాకరణ కాని, హక్కులేదని చెప్పిన సిద్ధాంతం కాని, గర్వాన్ని కనపరుస్తున్నట్లుగా కనిపిస్తున్న మాట కాని ఆమెను కృంగిపోనీయలేదు.

ఆ స్త్రీ తన ప్రవర్తన అంతటి ద్వారా మానసికంగా ఎంత దృఢంగా ఉన్నదో మనకు అర్థమౌచున్నది. అంతేకాక ఆశ్చర్యపడే రీతిలో విశ్వాసమును కనపరిచింది. అందుకే ప్రభువు అమ్మా నీ విశ్వాసం గొప్పది, నీవు కోరినట్లే నీకు అవునుగాక అని ఆమెతో చెప్పెను. వెంటనే ఆమె కుమార్తె ఆ గడియలోనే స్వస్థత పొందింది. ఇది ఎంతో ఆశ్చర్యకరమైన విషయం. అసాధ్యమైనదానిని సాధ్యపరచుకుంది ఆ స్త్రీ. ఆమెకు సహాయం చేసేవారు ఎవరూ లేరు, ప్రార్థనా పరురాలు కాదు కానీ ఎలా అయినా ఆయన సహాయం చేస్తాడని గట్టిగా నమ్మకం ఉంచింది, తన కుమార్తెను స్వస్థపరిచే వరకూ అడుగుతూనే ఉండాలని నిశ్చయించుకుంది. అందుకే ఆయన మెచ్చుకొని ప్రతిఫలం ఇవ్వటం జరిగింది. ఇది ఎంతో అద్భుతమైన విషయం. మన జీవితములలో కూడా దేవుని యొద్ద నుండి పొందవలసిన ప్రతీ విషయములోనూ నమ్మకం ఎంత ముఖ్యమైనదో మనము గ్రహించాలి. **మరియు ఆయన వారితో ఇట్లనెను - మీలో ఎవనికైన ఒక స్నేహితుడు ఉండగా అతడు అర్థరాత్రివేళ ఆ స్నేహితుని యొద్దకు వెళ్లి - స్నేహితుడా, నాకు మూడు రొట్టెలు బదులిమ్ము; నా స్నేహితుడు ప్రయాణము చేయుచు మార్గములో నా యొద్దకు వచ్చియున్నాడు; । అతనికి పెట్టుటకు నా యొద్ద ఏమియు లేదని అతనితో చెప్పిన యెడల । అతడు లోపలనే యుండి - నన్ను తొందరపెట్టవదు; తలుపు వేసియున్నది, నా చిన్నపిల్లలు నాతో కూడ పండుకొని యున్నారు, నేను లేచి ఇయ్యలేనని చెప్పునా? అతడు తన స్నేహితుడైనందున లేచి ఇయ్యక పోయినను, అతడు సిగ్గుమాలి మాటి మాటికి అడుగుట వలననైనను లేచి అతనికి కావలసినవన్నియు ఇచ్చును అని మీతో చెప్పుచున్నాను, అటువలె మీరును అడుగుడి, మీకియ్యబడును; వెదకుడి మీకు దొరుకును; తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతివానికి ఇయ్యబడును, వెదకువానికి దొరుకును, తట్టువానికి తీయబడునని అని మీతో చెప్పుచున్నాను. లూకా 11:5-10.**

**వారు విసుకక నిత్యము ప్రార్థన చేయుచుండవలెననుటకు ఆయన వారితో ఈ ఉపమానము చెప్పెను - దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్యపెట్టకయు నుండు ఒక న్యాయాధిపతి ఒక పట్టణములో ఉండెను. ఆ పట్టణములో ఒక విధవరాలును ఉండెను. ఆమె**

**అతని యొద్దకు తరచుగా వచ్చి నా ప్రతివాదికిని నాకును న్యాయము తీర్చుమని అడుగుచూ వచ్చెను గాని అతడు కొంత కాలము ఒప్పకపోయెను. తరువాత అతడు - నేను దేవునికి భయపడకయు మనుష్యులను లక్ష్యపెట్టకయు ఉండినను. ఈ విధవరాలు నన్ను తొందరపెట్టుచున్నది గనుక ఆమె మాటి మాటికి వచ్చి గోజాడకుండునట్లు ఆమెకు న్యాయము తీర్చునని తనలో తాననుకొనెను. మరియు ప్రభువు ఇట్లనెను - అన్యాయస్థుడైన ఆ న్యాయాధిపతి చెప్పిన మాట వినుడి. దేవుడు తాను ఏర్పరచుకొనిన వారు దివారాత్రులు తన్ను గూర్చి మొఱ్ఱపెట్టుకొనుచుండగా వారికి న్యాయము తీర్చడా? ఆయన వారికి త్వరగా న్యాయము తీర్చును; లూకా 18:1-8**

ఈ వాక్యముల ద్వారా కూడా పట్టువదలక, నమ్మకంతో అడగటం వలన మనము దేవుని యొద్ద నుండి పొందుకొనగలమని అర్థమగుచున్నది.

కాబట్టి ప్రియమైన దేవుని స్పర్శ పాఠకులైన మీరు ఎలాంటి విపత్కర పరిస్థితులలో అయిననూ ధైర్యంతో ముందుకు వెళ్ళవలెను. ఆశ్చర్యకరమైన దేవుని సహాయం కొరకు విడువక అడగవలెను. అప్పుడు తప్పక దేవుని సహాయం పొందగలరు.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

– సీరియల్ 33వ భాగము

మొరేవియన్ మిషనెరీల దగ్గర తార్చిన్ ఉద్యోగానికి కుదిరినప్పుడు పూ దగ్గర మొట్టమొదటిసారిగా సుందర్ అతనిని కలిసికొన్నాడు. అతడు టిబెట్ దేశీయుడు. సుందర్‌తో కలిసి సంతోషంగా ప్రయాణం చేస్తూ టిబెట్‌కు వెళ్దామనుకున్నాడు. సిక్కిం రాజధాని గాంగ్‌టక్ చేరిన తరువాత అధికారుల అనుమతి లేకుండా ముందుకు వెళ్ళడానికి వీలు పడలేదు. అవసరమైన అనుమతి కోసం ఓ వారం రోజులు ప్రతిరోజూ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి వచ్చినా వారికి అనుమతి దొరకలేదు. కాబట్టి ఇంకా ముందుకు వెళ్ళడం దేవుని చిత్తం కాదేమోనని, వెనకకి వెళితే బాగుంటుందని తలంచి భారతదేశమునకు తిరిగి వచ్చారు. సుందర్ నెమ్మదిగా ప్రయాణిస్తూ, స్టోక్స్‌గారు బాలుర పాఠశాల స్థాపించిన కోట్‌గర్‌కు దగ్గరలోనే ఉన్న సబాతుకు తిరిగి వచ్చాడు. ఈ స్థలంలోనే ఒకానొక దినమున ఒంటరిగా అడవులలోనికి పోయి ఆ బాలుర కోసం ప్రార్థిస్తున్నప్పుడు పరలోకం పోయే పారవశ్యం పొందాడు సుందర్.

యేసుక్రీస్తును గూర్చి ఇంతకు ముందు కలిగిన ఆధ్యాత్మిక అనుభవముల కంటే విభిన్నమైన అనుభవాలిప్పుడు కలిగాయి. ఈ పారవశ్యములో కొన్ని స్వరాలను, సంగీతమును వినడమే గాక దివ్యజ్యోతులను కూడా చూచాడు సుందర్. కొన్ని సంవత్సరముల తరువాత ఈ అనుభవమును వివరిస్తూ, కొన్నిసార్లు పదునైన సూదులు గుచ్చుకున్నట్లుగా ఉంది. ఆ స్థితిలో నేను వెలుగును చూచాను గాని అది నిజమైన వెలుగు కాదు. ఇలాంటి అనుభవం కలిగినప్పుడు అది దైవసంబంధమైనదో కాదో నిర్దుష్టంగా తెలిసికొనే శక్తి మన హృదయంలోనే ఉన్నది. కొన్నిసార్లు ఎంతో ఉద్రేకంగా ఉన్నట్లుండేది గాని దానిలో సంతోషముండేది కాదు. ఈ అనుభవాలన్నీ వాస్తవమైనవి కావని ఇవి ఒక పెద్ద ఆటంకమనీ గమనించాను. ఇవన్నీ హృదయమును ఎంత మాత్రమూ కదిలించలేక పోయాయి. కొన్నిసార్లు సాతాను గుసగుసగా చెప్తుండేవాడు. మరికొన్నిసార్లు వాని మాటలు తేటగానే వినబడుచుండేవి. కొన్నిసార్లు నీవు తప్పు చేశావు, ఇది మార్గం కాదు, నీవు తప్పు చేశావు, సత్యమును వెనుకకు త్రోసివేసి వచ్చావు, నీవొక పాపివి, నీకు రక్షణ లేదు అని చెప్తుండేవాడు. "ఈ మాటలు విన్నప్పుడు నేనెంతో కలవరపడిపోయాను. నాకు సహాయం


ఒకరిపై చాడీలు చెప్పే వారితో నీవు ఏకీభవిస్తే తరువాత నీ పని కూడా అంతే

చేయి ప్రభువా అని ప్రార్థించినపుడు ఆ ఉద్రేకము, గుసగుసలు, వణుకు, సూదులతో గ్రుచ్చినట్లుగా ఉండడము అవన్నీ ఆగిపోయాయి. ఇవన్నీ సాతాను కలిగించినవేనని అప్పుడు నాకు అర్థమైంది అని చెప్పాడు సుందర్.

అతనికి కలిగిన వ్యక్తిగత అనుభవములు ముందు ముందు ఇతరులను హెచ్చరించడానికి ఆయనకి ఎంతో తోడ్పడ్డాయి. మర్మయుక్తమైన వాటిని ఆశించేవారు వీటి విషయములో ఎంతో జాగ్రత్తగా ఉండాలి. మరి ముఖ్యంగా ఆరంభికులైన వారు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ లోకానుసారంగా జీవించేవారు ఇలాంటి అనుభవములను ఇంతకు ముందు ఎన్నడూ ఎరుగరు గనుక అవేవో గొప్పవని తలంచుచుంటారు గాని అవి సాతాను నుండియు, పాతాళములోని దురాత్మల నుండియు కలుగునవి మాత్రమే.

దురాత్మలకు భవిష్యత్ గురించి ఏదో కొంత తెలుసు గాని ఏదీ పూర్తిగా వారికి తెలియదు. వాతావరణ నిపుణులు రాబోయే దినాల్లోని వాతావరణాన్ని గూర్చి కొద్ది వారాలు ముందుగానే ఎలాగ చెప్పగలుగుచుంటారో అలాగే దురాత్మలు కూడా పరిస్థితుల ప్రభావమును గూర్చి వాటికి కొంత జ్ఞానముండడం వలన కొద్దికాలపు భవిష్యత్‌ని గూర్చి మాత్రమే చెప్పగలవు. ఇలా చేయడం వలన అవి ప్రజలను మోసం చేయగలుగుచున్నాయి. అయితే దైవ ప్రేరితులైన ప్రవక్తలు ఎన్నో సంవత్సరముల తరువాత జరగబోయే వాటిని ప్రవచించి చెప్తుంటారు. దయ్యాలకు వీరికి మధ్యనున్న వ్యత్యాసమిదే.

ఆత్మలలో విశ్వసించుచున్నామని చెప్పుకునేవారు పాతాళలోకంలోని ఈ ఆత్మలతోనే వారు సంబంధాలు పెట్టుకుంటున్నారు. ఈ దురాత్మలు ఆరంభంలో నూటికి 99 సత్యములు చెప్తూ ఒక్క అబద్ధాన్నే చెప్తుంటాయి. అయితే కాలక్రమేపి సత్యాలను తగ్గించి అబద్ధాలనే ఎక్కువ చెప్తాయి. ఇలా చేసి ప్రజలను తప్పు దారినిగాని, నాస్తికత్వం లోనికిగాని నడిపిస్తాయి. అయితే నిజంగా ఆత్మసంబంధియైనవాడు పాతాళలోకపు ఆత్మలు తెలియజేసే ఈ విషయములంటే హృదయములో ఒక రకమైన అయిష్టతను కలిగియుంటాడు. మన ఆసక్తిని రేకెత్తించేవాటిని మాత్రమే మనం వెదకినట్లైతే వాస్తవమైన ఆత్మలలోకం ఉన్న మెట్టులోనికి మనం ఎదగలేము. ఆత్మసంబంధమైన శక్తులను అంటే దైవశక్తులను గాని, దురాత్మ శక్తులనుగాని సుందర్ ఎరిగినవాడు కాకపోయినను ఆ అరణ్యములో ప్రార్థనకు వెళ్ళిన సందర్భములో సంభవించిన దానికి ఏ విధంగాను సిద్ధపడలేదు సుందర్.

–సేకరించబడినది, ఇంకా ఉంది



# " విజయ రహస్యం"

Hellow! పిల్లలూ బావున్నారా? Exams దగ్గరకి వచ్చేశాయి కదా బాగా చదువుతున్నారా? మంచి మార్కులు తెచ్చుకోవాలని Planned గా చదువు తున్నారా? Subjects కష్టంగా ఉన్నాయని feel అవుతున్నారా? ఏ విషయంలోనూ భయపడ కండి. Tention ప్రక్కనపెట్టి మనతో ఉన్న దేవుని వైపు చూస్తూ Exams ని బాగా వ్రాయండి. బైబిల్‌లో మీలానే ఒక చిన్న బాలుడు దేవుని వైపు చూస్తూ గొప్ప విజయాన్ని చూశాడు అతని గురించి తెలుసుకుందామా!

దావీదు అనే బాలుడు గొఱ్ఱెలను మేపేవాడు. ఇంటిలో అందరికంటే చిన్నవాడు. దావీదు ఒక చెట్టు క్రింద కూర్చుని మెల్లగా ఒక పాట పాడుకున్నాడు. పాటలన్నా, పాటలు పాడాలన్నా దావీదుకి భలే ఇష్టం. ఒక్కొక్కసారి దావీదు పక్షులు, చెట్లు, కాలువలు, కొండలు, జంతువుల గురించి స్వంతంగా పాటలు కట్టి పాడేవాడు, కొన్నిసార్లు దేవునికి వందనములు చెప్పే పాటలు పాడేవాడు. గొఱ్ఱెలు తలవంచుకుని మేస్తున్నాయి. దావీదు వంగి ఓ గులకరాయి తీసుకుని తన వడిసెలలో పెట్టాడు. చేతిని గిరగిరా తిప్పాడు. రెండు, మూడు, నాలుగుసార్లు తిప్పి విసిరేసాడు. రాయి రివ్వున వెళ్ళి దేనికి తగలాలో కరెక్టుగా దానికే తగిలింది. దావీదు నవ్వాడు.



దావీదుకి రాయి గురిచూసి కొట్టడం బాగావచ్చు. అతని ముగ్గురు అన్నల్లాగా సైన్యంలో చేరి యుద్ధం చేసే వయస్సు రాలేదు. కానీ అతను కాసే గొఱ్ఱెలను చంపడానికి వచ్చిన జంతువులతో పోరాడేవాడు.

ఒక రోజున దావీదు నాన్న అతనిని పిలిచాడు, " దావీదూ, ముగ్గురు అన్నయ్యలు ఎలా ఉన్నారో చూసిరా, వాళ్ళు తినేందుకు ఇంటినుండి ఏదన్నా పట్టుకెళ్ళు " అన్నాడు. దావీదు తన చిన్న మందను మరొకరికి అప్పగించి తన అన్నల దగ్గరకు బయలుదేరాడు. వారిని కలుసుకుని మాట్లాడుతూ ఉంటే ఒక వింత జరిగింది. దూరంగా నది దగ్గర ఒక పెద్ద శరీరం

ఉన్న మనిషి నిలబడి ఉన్నాడు. అంత ఎత్తు ఉన్న మనిషిని దావీదు ఎప్పుడూ చూడలేదు. ఆ పొడుగ్గా ఉన్న మనిషి భయం పుట్టించే గొంతుతో దావీదు జనులైన ఇశ్రాయేలీయుల సైన్యమును గట్టిగా పిలిచి ఇలా చెప్పాడు, " నాతో కుస్తీ పట్టేందుకు మీలో ఒకణ్ణి పంపించండి " ఎవరూ మాట్లాడలేదు. దావీదుకు ఆశ్చర్యం వేసింది. " ఏంటి, వాడితో యుద్ధం చేసేందుకు ఎవరూ వెళ్ళరేమిటి ?" అన్నాడు.

ఎవరూ అతనికి జవాబు చెప్పలేదు. వారందరికి భయమని దావీదుకి అర్థమైపోయింది. వాళ్ళకి భయమెందుకో దావీదుకు తెలియలేదు. దేవుడు వారికి తోడుగా ఉన్నాడు కదా. దేవుడు మన వైపు ఉంటే ఇంక భయమెందుకు ? " నేను వెళ్ళి వాడితో యుద్ధం చేస్తాను " అన్నాడు దావీదు. సైనికులు ఆశ్చర్యపోయి వెళ్ళి ఈ సంగతి రాజుతో చెప్పారు. అప్పుడు దావీదుని రాజు పిలిపించి నువ్వు చిన్నపిల్లవాడివి గదా అన్నాడు అందుకు దావీదు నా గొఱ్ఱెల మంద మీదకి వచ్చిన సింహాలనూ, ఎలుగుబంటునూ చంపడానికి దేవుడు నాకు సహాయం చేసాడు. **"యుద్ధము యెహోవాదే"** అన్నాడు దావీదు.

ఇలా చెప్పి ఆ పొడవాటి మనిషివైపు నడిచి వెళ్ళాడు. అందరూ చూస్తున్నారు. అంతా మౌనముగా ఉన్నారు. దావీదు నది ఒడ్డున ఐదు గుండ్రటి గులకరాళ్ళను ఏరి జేబులో వేసుకున్నాడు. ఆ పొడవాటి మనిషి దావీదు రాళ్ళు తీసుకు వస్తుంటే చూసి తెగనవ్వాడు. దావీదును తిట్ట సాగాడు. కాని దావీదు ఈ యుద్ధంలో నేనే గెలుస్తాను అని బదులు పలికాడు.

దావీదు రాయి తీసి వడిసెలలో పెట్టాడు. చేతితో గిరగిర తిప్పాడు రివ్వున రాయి వదిలాడు, ఆ రాయి తగలగానే ఆ పొడవాటి మనిషి ఠపీమని నేల మీద పడిపోయాడు. శత్రువులు దీన్ని చూడగానే అందరూ పారి పోయారు. దావీదుని అందరూ మెచ్చు కున్నారు.



**ప్రార్థన: ప్రియమైన యేసయ్యా! కష్టపడి చదువుకుని పరీక్షలు బాగా వ్రాసేందుకు నాకు తోడ్తై ఉండి దావీదు వలె జయం పొందుకోవటానికి సహాయం చేయండి ఆమెన్ !**

– ప్రేమతో మీ అక్కయ్య

# "నా జీవితములో దేవుని మేలులు"

శ్యామ్‌ప్రసాద్‌రావు, శ్రీరంగపురం

నా పేరు జి.శ్యామ్‌ప్రసాదరావు. మాది కృష్ణాజిల్లాలోని శ్రీరంగపురం అనే చిన్న పల్లెటూరు. మా అమ్మనాన్నలకు నలుగురి ఆడపిల్లల మధ్యలో ఒక్కడినే అగుట వలన గారాబముగా పెంచి పాలిటెక్నిక్‌లో జాయిన్ చేసారు. పాలిటెక్నిక్ చదివే సమయంలో అనేక దుర్వ్యసనములకు బానిసనై పాలిటెక్నిక్ ఫెయిల్ అయ్యాను. నా దుర్వ్యసనములు గమనించిన నాన్నగారు బాగా తిట్టడం వలన, రామోజీ ఫిల్మ్‌సిటీలో పనిచేసే మా ఊరి వ్యక్తిద్వారా అనాజ్‌పూర్ రావటం, ఏదైనా చేయాలనే పట్టుదలతో ఫిలింసిటీ క్యాంటీన్‌లో హెల్పర్‌గా జాయిన్ అవటం జరిగింది. జాయిన్ అయిన సంవత్సరానికి వివాహం చేశారు. అప్పుడు నాజీతం రోజుకు 45 రూపాయలు. ఇంటి దగ్గర నుండి బియ్యం, పప్పులూ, తెచ్చుకుంటేనే కుటుంబం గడిచేది.

మాది క్రైస్తవ కుటుంబం అగుట చేత ప్రార్థనకు వెళ్ళడానికి చర్చి లేదని నా భార్య బాధపడుతూ ఉండేది. గాయత్రినగర్‌లో ఉండే ఒక కుటుంబం, చర్చికి వెళ్ళి రావటం గమనించి, వారితో పరిచయం ద్వారా ఎపఫ్రా మినిస్ట్రీస్ చర్చి గురించి తెలుసుకోవడం జరిగింది. ఆ రోజులలో అనాజ్‌పూర్ నుండి ఫిలింసిటీ వెళ్ళేదారిలో రోడ్ ప్రక్కన తాటాకులతో వేయబడిన పాకను, అందులో ప్రార్థన చేసే పదిమందిని చూసి, ఇదేం మందిరం, ఇలా ఉంది అని ఎగతాళిగా నవ్వుకునేవాడిని. కాని నా భార్య ఆ మందిరమునకు వెళతాను అని బ్రతిమలాడి, నన్ను ఒప్పించి వెళ్ళడం ప్రారంభించింది. కొన్ని దినముల తరువాత దేవుని వాక్యమును శ్రద్ధగా వింటూ, బాప్తిస్మము ద్వారా రక్షణపొందింది.

2007వ సంవత్సరములో ఫైల్స్‌లో ఫిస్టులా అనే వ్యాధితో బాదపడుతూ ఉండేవాడిని. కొన్ని నెలల తరువాత ఆపరేషన్ చేయించగా అది ఫెయిల్ అవడం వలన, డాక్టర్స్ ఆయుర్వేదిక్ వైద్యం చేయించమని సలహా ఇచ్చారు. ఆ వైద్యం కొరకు నేను ప్రతిరోజు అనాజ్‌పూర్ నుండి చార్‌మినార్ వరకు వెళ్ళవలసి వచ్చేది. ఉదయం 6గం॥లకు బయలుదేరి ట్రీట్‌మెంట్ చేయించుకుని, డ్యూటీకి వెళ్ళి ఇంటికి వచ్చేసరికి రాత్రి 11గం॥లు అయ్యేది. ఇలా 5 నెలలు చేయవలసి వచ్చింది. నా వ్యాధిని తగ్గించి, నన్ను ప్రార్థన వైపు నడిపించమని, నా భార్య ప్రతిరోజూ ఏడుస్తూ ప్రార్థన చేస్తూ ఉండేది. నాకు వ్యాధి నయం అవ్వటం, చర్చికి సమీపంలో ఇల్లు అద్దెకు దొరకడం జరిగినది. ఆదివారం ఆరాధనకు రమ్మని నన్ను నా భార్య బ్రతిమాలుతూ ఉండేది. ఆమె ద్వారా విన్న సాక్ష్యములను బట్టి వెళ్లి చూద్దాం అనుకొని అయిష్టంగానే చర్చికి వచ్చాను.

 లేనివాటికోసం నిరంతరం అదే పనిగా తపిస్తూ ఉంటే ఉన్నవాటి ప్రయోజనాన్ని కూడా పొందలేం.

పరిచర్యలో కొనసాగుతున్న మొదటి రోజులలో దైవసేవకులు బాధ్యతలు అనే సబ్జెక్టుపై వరుసగా నాలుగు ఆదివారములు బోధించారు. అప్పటివరకు నాపై ఆధారపడిన తల్లిదండ్రుల గురించి గానీ, నా భార్య పిల్లల గురించి గానీ ఆలోచించే వాడిని కాదు. నేను, నా విలాసములు ఇదే జీవితం అనుకునే వాడిని. 2009 అక్టోబర్ 2వ తేదీ ఉపవాస ప్రార్థనలో సిగరెట్ అనే వ్యసనం నుండి విడిపించమని, బాధ్యత కలిగి జీవించేవాడిగా మార్చుమని ప్రార్థన చేయుట ద్వారా దేవుడు కృప చూపడం జరిగినది. తరువాత జనవరి 26వ తేదీ ఉపవాస ప్రార్థన ద్వారా మందు త్రాగటం అనే వ్యసనం నుండి బయటపడడం జరిగినది. అప్పటి నుండి క్రమం తప్పక ఆరాధనలకు హాజరై, రక్షణ పొందాను. దేవునియందు భయభక్తులు కలిగి ఓర్పు, సహనం అనే వాటిని అలవర్చుకొనుట వలన రోజువారీ జీతం తీసుకునే హెల్పర్‌గా జాయిన్ అయిన నేను ఈరోజు 4వేల మందికి సర్వీస్ ఇచ్చే క్యాంటీన్‌లో చీఫ్‌కుక్‌గా ఉండుటకు దేవుడు కృప చూపించారు.

దైవసేవకులు దేవుని వాక్యాన్ని బోధించే క్రమంలో కొన్ని ఆహారపు అలవాట్లు, నియమాల గురించి చెప్పేవారు. వాటిని విని గ్రహించి, ఆచరించుటవలన, నాకున్న గ్యాస్ట్రిక్ సమస్య నుండి బయటపడ్డాను. పరిచర్యలోని కొందరు వ్యక్తుల పరిచయం ద్వారా ఎదుటి వారిని గౌరవించే పద్ధతి, ఆర్థిక క్రమశిక్షణను నేర్చుకున్నాను.

దేవునిలో ఎదుగుటకు ప్రోత్సాహకరముగా ఉన్న మన పరిచర్యలో ఇన్ని మేలులు పొందిన మేము కృతజ్ఞత కలిగి జీవించునట్లుగాను, ఆత్మీయంగా ముందుకు కొనసాగునట్లుగాను మా కొరకు ప్రార్థించగలరు.


## ఉపవాస ప్రార్థన

**ఉపవాస ప్రార్థన - 2014, మే 1వ తేది (గురువారం)**

ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 4 గం.ల వరకు జరుగును.

ఆసక్తి కలిగినవారు మాత్రమే పాల్గొనవలసినదిగా మా విన్నపం.

**వివరములకు:**

9666666249 | 040-24202227



# సిలువ రక్తము

Good Friday (మంచి శుక్రవారము) అనగానే బైబిల్ గ్రంథములో మనకు తెలిసిన విషయం యేసయ్య సిలువ వేయబడిన దినము. అయితే ఆయన దేని కొరకు సిలువవేయబడ్డాడు అనే విషయము కొందరికి తెలియనే తెలియదు. ఆయన సిలువ వేయబడుటకు కారణం పాపము వలన మరణశిక్ష పొందవలసిన మనలను తప్పించుటకు, మన ప్రాణమునకు బదులుగా తన ప్రాణమును ఇచ్చియున్నాడు. ప్రాణము అనగా రక్తమే కనుక యేసు రక్తమునకు ఎంతో ప్రాముఖ్యత కలదు. యేసుక్రీస్తు రక్తము యొక్క ప్రాధాన్యతను ధ్యానించుకుందాము !

మనము పాపక్షమాపణ పొందడానికి, దైవ సన్నిధిలో ప్రవేశించడానికి సిలువపై యేసుక్రీస్తు చిందించిన రక్తమే కారణం. రక్తము చిందించకుండా పాపక్షమాపణ కలుగదనియు సామాన్యముగా చెప్పవచ్చును. (హెబ్రీ 9:22) క్రీస్తు రక్తము దేవుని న్యాయమును అంటే ధర్మశాస్త్రమును మీరడం వలన కలిగే శిక్షను సంపూర్ణముగా సంతృప్తిపరుస్తుంది. 1 యోహాను 3:4లో ఇలా ఉంది. ఆజ్ఞాతిక్రమమే పాపము. ధర్మశాస్త్ర అతిక్రమణ శిక్ష నుండి రక్తం మనలను రక్షిస్తుంది. నిర్గమకాండము 12వ అధ్యాయములో తొలిచూలు పిల్లలను చంపే సంహారక దూత నుండి కాపాడడానికి గొర్రెపిల్ల రక్తమును గడప కమ్ములపై పూయాలని దేవుడు ఆజ్ఞాపించాడు. తరువాత రానున్న దేవుని గొర్రెపిల్ల క్రీస్తుకు ఈ గొర్రెపిల్ల సాదృశ్యం. దేవుడు చెప్పాడు **"నేను ఆ రక్తమును చూచి మిమ్మును నశింపజేయక దాటిపోయెదను. నిర్గమ 12:13"**

**"అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు ; ఎట్లనగా మనము ఇంకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను. కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులముగా తీర్చబడి, మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రత నుండి రక్షింపబడుదుము." – రోమా 5:8,9**

**"దేవుని కృపామహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము, అనగా మన అపరాధములకు క్షమాపణ మనకు కలిగి యున్నది." – ఎఫెసీ 1:7**

దేవుని ధర్మశాస్త్ర విషయములో యేసుక్రీస్తు మన కొరకు కార్చిన రక్తము దేవునిని

సంతృప్తిపరిచింది. ఇప్పుడు అపరాధ భావము నుండి మన మనస్సాక్షిని శుద్ధీకరించడములో మనలను సంతృప్తిపరచాలి.

**"నిత్యుడగు ఆత్మ ద్వారా తన్ను తాను దేవునికి నిర్దోషినిగా అర్పించుకొనిన క్రీస్తు యొక్క రక్తము, నిర్జీవక్రియలను విడిచి జీవము గల దేవుని సేవించుటకు మీ మనస్సాక్షిని ఎంతో ఎక్కువగా శుద్ధి చేయును " - హెబ్రీ 9:14**

**"కావున యేసు కూడ తన స్వరక్తము చేత ప్రజలను పరిశుద్ధపరచుటకై గవిని వెలుపట శ్రమ పొందెను." - హెబ్రీ 13:12**

**"ఆయన యందు సర్వ సంపూర్ణత నివసింపవలెననియు, ఆయన సిలువ రక్తము చేత సంధి చేసి, ఆయన ద్వారా సమస్తమును అవి భూలోకమందున్నవైనను, పరలోకమందున్నవైనను వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచు కొనవలెననియు తండ్రి అభీష్టమాయెను. మరియు గత కాలమందు దేవునికి దూరస్థులును, మీ దుష్క్రియల వలన మీ మనస్సులో విరోధభావము గల వారునై యుండిన మిమ్మును కూడ తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును సమాధాన పరచెను" - కొలస్సీ 1:19-22**

**సహోదరులారా, యేసు మన కొరకు ప్రతిష్టించిన మార్గమున, అనగా నూతనమైనదియు, జీవము గలదియు ఆయన శరీరము అను తెర ద్వారా యేర్పరచబడినదియునైన మార్గమున, ఆయన రక్తము వలన పరిశుద్ధ స్థలము నందు ప్రవేశించుటకు మనకు ధైర్యము కలిగియున్నది గనుకను, దేవుని ఇంటిపైన మనకు గొప్ప యాజకుడున్నాడు గనుకను మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు ప్రోక్షింపబడిన హృదయ ములు గలవారమును, నిర్మలమైన ఉదకముతో స్నానము చేసిన శరీరములు గలవారము నైయుండి, విశ్వాస విషయములో సంపూర్ణ నిశ్చయత కలిగి, యథార్థమైన హృదయముతో మనము దేవుని సన్నిధానమునకు చేరుదము. - హెబ్రీ 10:19- 22**

సాతానుని, వాడి పనిని రక్తము ఏ విధంగా అడ్డుకుంటుంది అంటే వాడు ఎల్లప్పుడూ సహోదరులపై నేరారోపణ చేస్తూ ఉంటాడు. (ప్రకటన 12:10) ప్రభువు తన స్వరక్తముతో ప్రధాన యాజకునిగా తాను చేసే ప్రత్యేక పరిచర్య మూలముగా అపవాది యొక్క కపట పన్నాగాలను ఎదుర్కోవడం జరుగుతుంది.

**"ఇట్లుండగా ఏమందుము? దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధి ఎవడు ? తన సొంతకుమారుని అనుగ్రహించుటకు వెనుక తియ్యక మన అందరి కొరకు ఆయనను అప్పగించిన వాడు ఆయనతో పాటు సమస్తమును మనకి ఎందుకు అనుగ్రహింపడు? దేవుని**

**చేత ఏర్పరచబడిన వారి మీద నేరము మోపు వాడెవడు? నీతిమంతులుగా తీర్చువాడు దేవుడే ;శిక్ష విధించువాడెవడు ? చనిపోయిన క్రీస్తుయేసే ; అంతే కాదు, మృతులలో నుండి లేచినవాడును దేవుని కుడి పార్శ్వమున ఉన్నవాడును మన కొరకు విజ్ఞాపనము కూడా చేయువాడును ఆయనే ; - రోమా 8:31,33,34**

**ఆ కుమారుని యందు మనకు విమోచనము, అనగా పాపక్షమాపణ కలుగుచున్నది. - కొలస్సీ 1:14**

యేసయ్య రక్తము ఆయన ఇచ్చిన ధర్మశాస్త్ర శిక్ష నుండి మనలను విడిపించుటకు, మనస్సాక్షి దోషారోపణ నుండి మనలను కాపాడడం మాత్రమే కాక సాతాను యొక్క నేరారోపణ నుండి మనలను కాపాడడం జరుగుతున్నది. అందుకే ప్రతి దినము, ప్రతి క్షణము మన జీవితములకు ఆయన రక్తము అవసరం. ఎవరు ఆయన రక్తమును ఆశ్రయించుదురో అట్టివారు ఎల్లప్పుడూ బహు సంతోషముగా ఉండెదరు. మన జీవితములలో గుడ్‌ఫ్రైడే దినములలో మాత్రమే కాకుండా, ఎల్లప్పుడూ ఆయన రక్తమును ఆశ్రయించుట ద్వారా పవిత్రులమై దేవునికి సమీపస్థులుగా మారెదము.

అట్టి ధన్యతను దేవుడు దయచేయును గాక !



# ప్రార్థన - ఊపిరి పీల్చుట వంటిదే

**సమర్పించుకొనుట మరియు కట్టుబడియుండుట :-**

**"ఆత్మ వలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపన చేయుచు మెలకువగా ఉండుడి" - ఎఫెసీ 6:18.**

మనం అన్ని సమయములలో ఆత్మలో ప్రార్థిస్తున్నట్లైతే పరిశుద్ధాత్ముడు మన ప్రార్థనా జీవితములలో వివిధ కాలములలో నుండి నడిపించుటను మనం గ్రహిస్తాము. స్తుతి ఆరాధనా, కృతజ్ఞతాస్తుతులు అనే ప్రార్థనను ప్రతిరోజూ చేస్తూ ఉంటాము. ఇవి మన ఆత్మలను తేలికగానూ, స్వేచ్ఛగానూ ఉంచుతాయి. అలాగే అపవాదికి విరోధముగా ఆత్మీయ యుద్ధములో ఇవి చాలా విలువైనవి. నిరాశను మరియు నిరుత్సాహమును స్తుతి నివారిస్తుంది. స్తుతి, ఆరాధనలు దేవుని గౌరవిస్తాయి కాని మనం ఇతర విషయముల కొరకైన ప్రార్థనలు కూడా చేయవలసిన సమయములు ఉన్నాయి. సమర్పణ మరియు ఆధీనము చేసికొను ప్రార్థనలను గురించి మనం తెలుసుకొనవలసిన అవసరం ఉన్నది. దీనినే "చేతులెత్తి" ప్రార్థన అని కూడా అంటారు. ఎందుకంటే అది మనలను మనం దేవునికి అప్పగించుకొనుట (సమర్పణ ప్రార్థన) మన పరిస్థితులను దేవునికి అప్పగించుట(అధీనము చేయు ప్రార్థన) వలన ఫలితమును చూడగలము.

**సమర్పణా ప్రార్థన:**

ఉదయముననే చేతులెత్తి "యెహోవా నీ దిక్కునకు చూచి నా ఆత్మను ఎత్తికొనుచున్నాను" అను సమర్పణా ప్రార్థన చేయుట మంచిది. ఈ మాటలు నిజమైన సమర్పణను - సంపూర్ణముగా, స్వచ్ఛందంగా దేవునికి అప్పగించుకొనుటను వివరిస్తు న్నాయి. సమర్పణా ప్రార్థనలో మనం దేవునితో ఈలాగు చెప్పాలి. "దేవా, ఇక్కడ నేను, నన్ను నేను అర్పించుకుంటున్నాను. కేవలం నా ధనం కాదు, నన్ను నేనుగా నన్నే అప్పగించు కుంటున్నాను. ఆదివారం ఉదయం ఒక్క గంట కాదు, రోజులో కొంత భాగమును కాదు, నన్నే నీకు అప్పగించుకుంటున్నాను. నా జీవితమంతటిని నీ యొద్దకు తెచ్చియున్నాను, నీ బలిపీఠంపై ఉంచియున్నాను. నాతో నీవేం చేయదలచుకున్నావో అలా జరిగించు. ఈ దినం నాతో నువ్వు మాట్లాడు. ఇవన్నీ సమర్పణ అనే అర్థమును ఇస్తాయి.

మనం దేనినైననూ సమర్పించినపుడు, దానిని దేవుని ఉపయోగం కొరకై వేరుగా ఉంచుతాము. కాబట్టి మన జీవితములను సమర్పించుకొనినపుడు, మనం మన శరీర

వాంఛలకు, లోక విలువలకు, ప్రకృతి పరమైన ఆలోచనలకు, క్రమశిక్షణ లేని జీవిత విధానానికి, చెడు అలవాట్లకు, దేవుని వాక్యముతో ఏకీభవించని ప్రతిదానికి వ్యతిరేకముగా తిరుగుతాము. మన ఉద్దేశ్యములకు మరియు దైవసంబంధం కాని ఉద్దేశ్యములకు మధ్య దూరం పెడతాము. కాబట్టి మనలను దేవుడు ఉపయోగించుకొనునట్లు, మనం అందుబాటులో ఉండునట్లు సిద్ధపాటు కలిగి ఉంటాము.

మనలను మనం దేవునికి సమర్పించుకొన్నప్పుడు, మనం ఏమైయున్నామో దానంతటినీ దేవునికి ఇచ్చు జ్ఞానము కలిగి ఉండాలి. మనది కానిది కూడా ఆయనకే ఇవ్వాలని తెలిసికొని ఉండాలి. మన బలహీనతలలో దేవుడు తనను తాను బలముగానూ తరచుగా ప్రభావవంతంగానూ కనుపరచుకుంటారు. కాబట్టి వాటిని ఆయన నుంచి దాచవలెనని మనం భావించనవసరం లేదు. ఆయనకు మన గురించి సమస్తము తెలిసేయున్నది. మనలను అపరిమితముగా ప్రేమించుచున్నాడు, కాబట్టి ఆయన యొద్ద ఏదీ దాచవద్దు, బలహీనతలు కూడా, సమస్తము ప్రభువునకు కానుకగా సమర్పించినప్పుడు గొప్ప స్వేచ్ఛ లభిస్తుంది.

సమర్పించుకోవడం లేక దేవునికి అప్పగించుకోవడం అనేవి తేలికగా తీసుకునే విషయములు కావని మనం అర్థం చేసుకోవాలి. సమర్పణా ప్రార్థన ఒక గంభీరమైన ప్రార్థన. అది ఎప్పుడైతే ఒక గంభీరమైన హృదయం నుండి వస్తుందో అప్పుడు గంభీరమైన ఫలితాలు కనిపిస్తాయి. "గంభీరమైన ఫలితాలు" అంటే అర్థమేమిటంటే, ఎప్పుడైతే మనం దేవునితో "నా సమస్తము తీసుకొని నా జీవితములో నీ చిత్తానుసారముగా జరిగించు" అని చేప్తామో, దేవుడు పని జరిగించడం మొదలుపెడతాడు. మనందరి జీవితములలో బలహీనతలు ఉన్నాయని మనకు తెలుసు కాబట్టి మనం సమర్పించుకున్నప్పుడు దేవుడు ఆ విషయాలతో పని చేయడం మొదలుపెడతాడు. మనం దేవునికిచ్చినది దేవునికి చెందినదే అవుతుంది, మరియు ఆయన మనలను వాడుకొనవలెనంటే మనలో ఆయన పని జరిగించవలసియున్నది. మనము ఆయనను అది చేయనివ్వాలి.

–సేకరించబడినది, ఇంకా ఉంది

జాయిస్‌మేయర్

# లోయలు



## బెరాకా లోయ :

యెహోషాపాతు రాజు అమ్మోనీయులను, మోయాబీయులను, ఎదోమీయులను ఓడించిన పిదప ఈ లోయలోనే దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించెను.

## హమోన్గోగు లోయ :



గోగు జయింపబడినప్పుడు అతడును అతని సేనా సమూహములను పాతిపెట్టబడబోవు లోయకు అలంకార నామము ఇది. ఈ లోయ ఓడిపోయిన రష్యన్‌లను పాతిపెట్టు ప్రదేశము.



## యెజ్రెయేలు లోయ :

ఈ లోయ యెజ్రెయేలు పట్టణము నుండి తూర్పుగా యొర్దాను నది వరకు వ్యాపించి ఉన్నది. గిద్యోను కాలమున గిద్యోనుతో యుద్ధము చేయుటకు అమాలేకీయులు ఇచ్చట బస చేశారు.

## రెఫాయీము లోయ :



యెరూషలేమునకు సమీపమందుండు లోయలలో ఒకటి. ఇది యెరూషలేము నైరుతి దిక్కు నుండి బెత్లెహేము వరకు వ్యాపించును. దావీదు ఫిలిష్తీయులను ఈ లోయలో రెండుసార్లు ఓడించెను.




# బైబిల్ క్విజ్ -33

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి.
(ఆదికాండములో నుండి ఇవ్వబడినవి)

**1. యోబు స్వస్థలం, మరియొక వ్యక్తి పేరు ఒకటే? ఆ పేరు ఏమిటి?**

**2. మొదట మరణించిన వ్యక్తి పేరు ఏమిటి?**

**3. ఆకాశమును తాకే గోపురమును ప్రజలు ఎక్కడ నిర్మించారు?**

**4. ఓడ కొండ మీదకి ఎప్పుడు చేరింది?**

**5. యెహోవా ఎదుట పరాక్రమము గల వేటగాడు ఎవరు?**

**6. అబ్రాహాము ఆస్తికి వారసుడవుతాడు అని అనుకున్న సేవకుడు ఎవరు?**

**7. నోవహు పేరుకు అర్థమేమిటి?**

**8. ఒక స్త్రీ పుట్టింది, చనిపోయింది, కానీ సమాధి చేయబడలేదు? ఆ స్త్రీ పేరేమిటి?**

**9. ఓడని తయారు చేయడానికి నోవహు వాడిన చెట్టు ఏమిటి?**

**10. మనుష్యుల భాషలు దేవుడు తారుమారు చేసింది ఎక్కడ?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఏప్రియల్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మే-2014 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 32 జవాబులు :</u>**

| | |
|---|---|
| **1. సర్పము (ఆది 3:1)** | **2. హనోకు (ఆది 4:17)** |
| **3. ఏడవ దినము (ఆది 2:3)** | **4.** ఆదాము, హవ్వ |
| **5. ఆరవ రోజు (ఆది 1:26-30)** | **6.** హవీలా (ఆది 2:11) |
| **7. నిరాకారముగానూ, శూన్యముగానూ (ఆది1:2)** | **8. 1533** |
| **9. కయీను (ఆది 4:1)** | **10.** ఐదుసార్లు |

**<u>బైబిల్ క్విజ్ - 32 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

షీబా, పాల్‌రాజ్, జగదీశ్ కుమార్

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## మార్చి - ఏప్రిల్

**భాగ్యలత :** రాజేశ్వరి, వసుంధర, శ్రీదివ్య, స్వప్న, ప్రాముఖ్య, కోటేశ్వరి, రత్నాకర్, గోపీనాధ్, జ్యోతి, లత(యేసమ్మ), విక్రమ్‌కుమార్, సుమలత, నాగమణి, విస్మయ్, ఐలయ్య, వినోద్, సుష్మ, రూతు, బ్యూలా, జగన్, మేఘ, సాత్విక, హరీష్‌బాబు, రజని, సుహాసిని, హెప్సీబా, కృపారాణి, సిద్ధమ్మ, సువర్ణరత్న, పుష్పావతి, రిష్విన్‌రాజు, కీన్‌అశ్విన్, యోజస్వి, షారోన్, అభినయ, బోయజ్, శ్రీవాణి, వెంకటరమణి, సురేష్, గోపీచంద్, పార్వతి, ఎస్తేరు, అరుణ, కిరణ్, జయశీల, రజిత, ప్రియాంక, నోయాగ్రేస్, నిరీక్షణ్, సాగర్, తేజ, నమ్రత, సుమన్ విజయకుమారి, కృష్ణవేణి, సింధూర, లలితాసాయి, ఎలీషాబాబు,అనూష, సూచన, బాలచందర్, ప్రసన్న, శేషగిరిరావు, మణెమ్మ, అభిషేక్, విశ్వాస్, రాజేష్, జాన్‌విక్టర్, విజయ, వర్షిణి, శ్రీనివాసరావు, శ్రీదేవి, పద్మ, గోపాల్, రాజు, జీవన్, దీపిక, శ్యామల, పాధ్విక, కెజియా, మధురిమ, వాత్సల్య, పద్మాకర్, ఆషా పర్ణిక, జయ, కృపారావు, కళ, నాగేష్, ప్రియాంక, పద్మ, జిన్నిబాబు, ఏలియా, పుష్పలత, నోవా, శ్రీకాంత్‌రవి, సలోమియ, పద్మ, తిమోతి, మోజెస్, దీపిక, సుజాత, గీత, రాహుల్, గంగేయుడు, సందేశ్, బందేష్

**చింతల్ :** రాజేష్, స్నేహ, శ్రీకాంత్, జయానంద్, బాలరాజు, విజయ్, రాణి, శిరీష, శాంతిప్రియ, రాధారాణి, సూర్యదీపిక, సురేంద్ర, హేమకుమారి, జీవన్‌కుమార్, విజయ, డేవిడ్, సుధాకర్, మైఖేల్, అనంతరావు, రాజామన్నార్, మోహన్

**అనాజ్‌పూర్ :** ప్రభుదాస్, మరియమ్మ, కరీమున్, ఆనందరావు, ధనలక్ష్మి, శ్రావణి, రూతు, రమేష్‌బాబు, పీటర్, డేవిడ్, పాల్‌రాజ్, స్వాతి, ఆరాధన, కృపావరుణ్

**ఇ.సి.ఐ.యల్ :** లలితా సాల్మన్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

మీ ప్రార్థనావసరతలు:

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

2014 జనవరి 26 వ తేది - హైదరాబాద్ - హయత్ నగర్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్,
ఛాపెల్ ఆడిటోరియం నందు జరిగిన ఆదివారం ఆరాధన మరియు ఉపవాస ప్రార్థన.



2014 జనవరి 26 వ తేది - హైదరాబాద్ - హయత్ నగర్, వర్డ్ అండ్ డీడ్ స్కూల్, ఛాపెల్ ఆడిటోరియం నందు జరిగిన ఆదివారం ఆరాధన మరియు ఉపవాస ప్రార్థనలో పాల్గొనిన సహోదర సహోదరీలు.






# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras